## క్లుప్తంగా

### కాలనీ సమస్యలపై వినతి



మేయర్ బీవై రామయ్యకు వినతి పత్రమిస్తున్న ఎన్‌జీఓ కాలనీ వాసులు

కల్లూరు: కల్లూరు అర్బన్ పరిధిలోని ఎన్‌జీఓ కాలనీలో నెలకొన్న సమస్యలపై కాలనీవాసులు బాలచంద్రారెడ్డి, ఎన్‌జీఓ కాలనీ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఓబులేసు ఆదివారం మేయర్ క్యాంపు కార్యాలయంలో నగర మేయర్ బీవై రామయ్యకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సోమవారం జరగనున్న నగరపాలక సర్వసభ్య సమావేశంలో కాలనీ పనులు మంజూరయ్యే విధంగా చూస్తానని మేయర్ రామయ్య హామీ ఇచ్చారు. కాలనీ అసోసియేషన్ సెక్రటరీ హుస్సేన్, సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

### సైక్లింగ్‌తో సంపూర్ణ ఆరోగ్యం



సైకిల్ ర్యాలీలో ఎస్ఐ పరమేష్‌నాయక్, పోలీసులు

సి.బెళగల్: ప్రతిరోజూ వ్యాయామం చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని ఎస్ఐ పరమేష్‌నాయక్ అన్నారు. ఆదివారం ఫిట్ ఇండియా సండేస్ ఆన్ సైకిల్ కార్యక్రమంలో భాగంగా స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి బస్టాండ్ వరకు పోలీస్ సిబ్బందితో కలిసి సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. పోలీస్ సిబ్బంది, ప్రజలు వ్యాయామం చేయడం ద్వారా శారీరక ధృడత్వంతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు.. పోలీసులు ఇకపై ప్రతి ఆదివారం సండేస్ ఆన్ సైకిల్ కార్యక్రమంలో పాల్గొని కాలుష్య నివారణకు కృషి చేయాలన్నారు. సైకిల్ ర్యాలీలో హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ ఆచారి, కానిస్టేబుళ్లు సుదర్శనం, శ్రీరాములు, శ్రీనివాసులు గౌడ్, గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

### ప్రమాదాల నివారణకు చర్యలు



మెట్లను పూడ్చి వేస్తున్న దృశ్యం

పాణ్యం: మండల కేంద్రంలోని ఎస్సార్బీసీ ప్రధాన కాల్వకు ఏర్పాటు చేసిన మెట్లను అధికారులు పూడ్చివేశారు. హైవే వద్ద ప్రధాన కాల్వకు నిర్వహణ కోసం గతంలో మెట్లను ఏర్పాటు చేశారు. ఈ మెట్లు ఉండటం వల్ల ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే లారీ డ్రైవర్లు, క్లీనర్‌లు స్నానాలు చేసేందుకు, కాలకృత్యాలు తీర్చుకునేందుకు దిగే క్రమంలో ప్రమాదశాత్తు కాల్వలో జారిపడి కొట్టుకుపోయి మృతి చెందారు. ఇలా పదుల సంఖ్యలో మృతి చెందడంతో పోలీసులు ఎస్సార్బీసీ అధికారులకు సూచించారు. సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేయగా అనుమతి రావడంతో ఆదివారం కడా ఈఈ క్రిష్ణన్న ఆదేశాల మేరకు మెట్లను పూడ్చి వేశారు. దీంతో ప్రమాదాలు తగ్గుతాయని అధికారులు తెలిపారు.

### బైక్ ఢీకొని వృద్ధుడి మృతి

కర్నూలు(రూరల్): రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొనడంతో వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో జరిగింది. వివరాలు.. శ్రీనివాసులు (60) అనే వృద్ధుడు తన మనువడి పుట్టిన రోజు ఫంక్షన్‌కు ఎమ్మిగనూరు నుంచి కర్నూలులోని శరీన్ నగర్‌కు వచ్చాడు. సొంత పని మీద కర్నూలు రిజిస్టర్ కార్యలయం ఎదురుగా గుత్తి హైవే రోడ్డును దాటుతుండగా వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ మేరకు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు వెల్లడించారు

### కుక్కకు స్నానం చేయించబోయి నదిలో పడి మృత్యువాత


కర్నూలు(రూరల్): పెంపుడు కుక్కకు స్నానం చేపించబోయి కర్నూలు నగరం సాయిబాబా సంజీవనగర్‌కు చెందిన బోయ క్రిష్ణ (30) తుంగభద్ర నదిలో జారిపడి మృతి చెందాడు. ఇతడు అవివాహితుడు. రియల్ ఎస్టేట్ వ్యాపారి. శనివారం సాయంత్రం కాలనీకి సమీపంలో ఉన్న తుంగభద్ర నదిలో పెంపుడు కుక్కకు స్నానం చేపించేందుకు తీసుకెళ్లాడు. అదుపు తప్పి నదిలో జారిపడి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచరం అందించగా నది వెంట గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఆదివారం జొహరాపురం సమీపంలో నది ఒడ్డున మృతదేహం లభ్యమైంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు 1వ పట్టణ పోలీసులు తెలిపారు.

### తప్పిన ప్రమాదం

పాణ్యం: మండల పరిధిలోని సుగాలిమెట్ట వద్ద కర్నూలు వైపు వెళ్తున్న కంటైనర్ ప్రమాదశాత్తు బ్రిడ్జి కిందకు వెళ్లింది. హైవే అధికారులు తెలిపిన వివరాల మేరకు.. చెన్నై నుంచి మహారాష్ట్రకు వెళ్తున్న కంటైనర్ ప్రమాదవశాత్తు రోడ్డు సైడ్‌కు దిగి బ్రిడ్జిని ఢీకొంది ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. సమాచారం తెలుసుకున్న హైవే పోలీసులు క్రేన్ సాయంతో కంటైనర్‌ను బయటకు తీసి ట్రాఫిక్ సమస్య లేకుండా చేశారు.

# మలుపులు .. ప్రమాద పిలుపులు

- దిగువపాడు రోడ్డు మలుపుల మయం
- కర్నూలు – సుంకేసుల రహదారిలో ప్రమాదకరంగా మలుపు
- ప్రమాదాలు జరుగుతున్నా నివారణ చర్యలు శూన్యం
- పట్టించుకోని ఆర్అండ్‌బీ అధికారులు



దిగువపాడు వద్ద..



దిన్నెదేవరపాడు గ్రామ సమీపంలో..



జి.సింగవరం వద్ద ప్రమాదకరంగా ఉన్న మలుపు

కర్నూలు(రూరల్): మండలంలోని కర్నూలు– సుంకేసుల రోడ్డులో జి.సింగవరం గ్రామ విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద గతేడాది లారీ, కారు ఢీకొని కొందరు అక్కడిఅక్కడే మరణించారు. తర్వాత కొన్ని రోజుల వ్యవధిలోనే ఆర్.కె.దుద్యాల, తులాశాపురం గ్రామస్తులు ఇక్కడ జరిగిన మరో ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. నిత్యం ప్రమాదాలతో ఈ రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. అనేక మలుపులతో కూడిన ఈ రోడ్డు మార్గంలో నిడ్జూరు, జి.సింగవరం, ఆర్.కొంతలపాడు, ఆర్.కె.దుద్యాల, తులశాపురం, సుంకేసుల, ఎదూరూరు గ్రామాలకు చెందిన ప్రజలు నిత్యం ప్రయాణాలు సాగిస్తుంటారు. వీరితో పాటు విద్యార్థులు, సుంకేసుల బ్యారేజ్ పర్యాటక ప్రాంతం కావడంతో సెలవు రోజుల్లో, నిరంతరం పర్యాటకులు ఈ రోడ్డు మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. అదే విధంగా వందలకొద్దీ టిప్పర్లు సి.బెళగల్ మండలం నుంచి కర్నూలు నగరానికి ఇసుక లోడ్‌తో రాకపోకలు సాగిస్తుంటాయి.

**అడుగడుగునా గండమే!**

దాదాపుగా 27 కి.మీ ఉన్న కర్నూలు–సుంకేసుల అర్అండ్‌బీ రహదారిపై నిడ్జూరు గ్రామ సమీపాన చింతమాడ టర్నింగ్ వద్ద గతంలో రోడ్డు ప్రమాదాలు జరిగి కొంతమంది ప్రాణాలు కోల్పోయారు.
– ఆర్.కొంతలపాడు గ్రామ సమీపాన కడ్డీల మోరీ వద్ద గత అక్టోబర్‌లో పత్తి లోడ్‌తో వెళుతున్న బొలేరో వాహనం అదుపుతప్పి వరి పొలంలో బోల్తా పడటంతో పత్తి సంచులు రైతులు మీద పడి ఊపిరాడక ఇద్దరు అక్కడిక్కడే మృతి చెందారు.

**దిగువపాడు మలుపు యమా డేంజర్**

కర్నూలు మండల పరిధిలో దిగువపాడు గ్రామ సమీపంలో ప్రమాదకర మలుపు ఉంది. ఈ మార్గం గుండా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు మిడ్తూరు, నంద్యాల వెళ్లి వస్తుంటారు. అయితే ఏ మాత్రం ఆదమరచినా ఈ మలుపు వద్ద ప్రమాదానికి గురి కావాల్సి వస్తుంది. సూచిక బోర్డులు లేకపోవడంతో రాత్రిపూట పలువురు వాహనదారులు ప్రమాదానికి గురై గాయాలపాలయ్యారు. కొందరు ప్రాణాలు కోల్పోయారు. అధికారులు స్పందించి మలుపు వద్ద రోడ్డును విస్తరించడంతో పాటు రాత్రి పూట ప్రమాదాలు జరగకుండా విద్యుత్ లైట్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని చుట్టు పక్కల గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

**ప్రమాదకరంగా దిన్నెదేవరపాడు రహదారి మలుపు**

దిన్నెదేవరపాడు గ్రామానికి వెళ్లే అర్అండ్‌బీ రహదారిలో కార్బైడ్ ఫ్యాక్టరీ సమీపాన ఉన్న మలుపు ప్రమాదకరంగా ఉంది. ఈ రహదారిలో నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. ఏపీఈఆర్‌సీ భవనం పక్కనే ఉన్నందున నిత్యం వాహనాలు, జిల్లా ఉన్నతాధికారులు రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రం, బి.తాండ్రపాడు గ్రామానికి వెళ్లేవారు ఈ రోడ్డులోనే వెళ్తుంటారు. అయితే మలుపు ప్రమాదకరంగా ఉండటంతో పలు పర్యాయాలు వాహనాలు ఢీకొని బోల్తాపడిన ఘటనలు ఉన్నాయి. మలుపు వద్ద ఎలాంటి సూచిక బోర్డులు లేవు. కనీసం ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

### అదుపు తప్పితే వాగులో పడతారు



పడిదెంపాడు సమీపంలోని మలుపు

సూదిరెడ్డిపల్లె స్టేజీ నుంచి పడిదెంపాడు మీదుగా పూడూరుకు పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో 10 కి.మీ రోడ్డు ఉంది. ఈ గ్రామాలకు కొన్ని నెలలుగా ఆర్టీసీ బస్సులు నడుస్తున్నాయి. పడిదెంపాడు రైతులు పలు కూరగాయలు, ఆకుకూరలు పడించి అమ్ముకునేందుకు నగరానికి వస్తుంటారు. రెండు గ్రామాల విద్యార్థులు స్కూళ్లు, కాలేజీల్లో చదువుకునేందుకు ద్విచక్ర వాహనాలు, ఆటోలు, స్కూల్ వ్యాన్‌లలో నగరానికి రాకపోకలు సాగిస్తుంటారు. రవీంద్ర గ్లోబల్ స్కూల్ సమీపాన కేసీ కెనాల్ వంతెన వద్ద వాగు పక్కనే రోడ్డు పక్కన ఉండటం వల్ల ఈ రోడ్డుపై ప్రయాణం సాగించేవారు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రాకపోకలు సాగిస్తుంటారు. అలంపూర్ పుణ్యక్షేత్రానికి ఈ రోడ్డు మీదుగా సమీప గ్రామల ప్రజలు వెళ్తుంటారు. ప్రహరీ లేనందున ఏ మాత్రం వాహనం అదుపు తప్పినా వాగులో పడిపోతారు. గతంలో కొంతమంది పడి గాయాల పాలయ్యారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు, పంచాయతీ రాజ్ శాఖ వారు మండల పరిధిలో రోడ్లను బాగు చేయాలని, ప్రమాదకర మలుపులు, వంతెనలను పరిశీలించి వాహనదారులు ప్రమాదాల బారిన పడకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

### ప్రమాదకరంగా ఉన్నాయి



కర్నూలు – సుంకేసుల ఆర్అండ్‌బీ రహదారిపై నిడ్జూరు, జి.సింగవరం, ఆర్.కొంతలపాడు గ్రామాల సమీపాన మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి, ఈ రహదారిపై గతంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోయారు. నిత్యం ఇసుక టిప్పర్ల రాకపోకలు, వాహనదారులు, విద్యార్థులు, ఉద్యోగులు, సుంకేసుల బ్యారేజీ చూసేందుకు వచ్చే పర్యాటకులతో రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. ప్రమాదాల నివారణకు సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

– రాఘవేంద్ర, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు, ఉల్చాల గ్రామం

### రోడ్డు విస్తరణ చేపట్టాలి



దిగువపాడు ఆర్అండ్‌బీ రోడ్డులో ఎన్నో ప్రమాదకర మలుపులు ఉన్నాయి. సవారమ్మ గుడి నుంచి రహదారికి ఇరువైపులా ఉన్న ముళ్ల పొదలు తొలగించాలి. హంద్రీ – నీవా కాలువ వద్ద రోడ్డును బాగు చేయాలి. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డులో ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని. గ్రామ సమీపాన ప్రమాదకరంగా ఉన్న మలుపు వద్ద రోడ్డును విస్తరించాలి.

– బి.దస్తగిరి, దిగువపాడు గ్రామం

# ప్రయాణ కష్టాలు 'ఉచితం'

- బస్సుల కోసం నిత్యం పడిగాపులే!
- రద్దీకి తగ్గట్టు బస్సుల్లేక ఇబ్బందులు
- రోజూ నిలబడే ప్రయాణం



కోడుమూరు పాతబస్టాండ్‌లో బస్సుల కోసం వేచివున్న ప్రయాణికులు



బస్సు ఎక్కేందుకు పోటీపడుతున్న ప్రయాణికులు

కోడుమూరు రూరల్: కూటమి ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకంతో ప్రయాణికుల కష్టాలు రెట్టింపయ్యాయి. అంతంత మాత్రంగా ఉన్న ఆర్టీసీ బస్సు సర్వీసులతో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులకు ఇప్పుడు మరిన్ని కష్టాలు తోడయ్యాయి. కోడుమూరు మీదుగా నిత్యం ఆదోని, గుంతకల్, మంత్రాలయం, ఎమ్మిగనూరు, పత్తికొండ వంటి ప్రాంతాల నుంచి నిత్యం వేలాది మంది ప్రయాణికులు అటు నుంచి ఇటుగా ఇటు నుంచి అటుగా ప్రయాణాలు చేస్తుంటారు. అయితే గత దశాబ్ధ కాలంగా ప్రయాణికుల రద్దీకి తగ్గట్లుగా బస్సుల్లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. చాలామంది ప్రయాణికులు ఆర్టీసీ బస్సులు దొరక్క ప్రైవేట్ వాహనాలు, సొంత వాహనాల్లో తమ గమ్యస్థానాలకు చేరుకునేవారు. అయితే ఇటీవల కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ప్రవేశపెట్టడంతో ఆర్టీసీ బస్సుల్లో రద్దీ విపరీతంగా పెరిగింది. ప్రయాణికుల రద్దీకి తగ్గట్లుగా ప్రభుత్వం సర్వీసులను నడపకుండా ఉన్న బస్సులతోనే కాలం నెట్టుకొస్తుండడంతో బస్సులన్నీ కిక్కిరిసిపోతున్నాయి. బస్సులో నిలబడటానికి కూడా చోటులేని విధంగా 80 నుంచి 90 మంది ప్రయాణికులు ఎక్కుతుండడంతో సీటు కోసం సిగపట్లు పట్టే పరిస్థితి నెలకొంది. దీనివల్ల మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించలేని పరిస్థితి నెలకొంది.

**సీటు దొరికితే అదృష్టమే!**

కోడుమూరు నుంచి కర్నూలు, ఆదోని, గుంతకల్ వంటి సుదూర ప్రాంతాలకు నిత్యం వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు పథకం వల్ల బస్సులన్నీ కిక్కిరిసి వస్తుండడంతో కోడుమూరు వాసులకు ఆర్టీసీ బస్సుల్లో సీటు దొరకని పరిస్థితి నెలకొంది. బస్సులో నిలబడి ప్రయాణం చేద్దామనుకున్న కొందరు డ్రైవర్లు ఆదోని, ఎమ్మిగనూరు నుంచి వచ్చే బస్సులను కోడుమూరులో ఆపకుండా వెళుతున్నారు. దీనివల్ల కోడుమూరు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే ఆర్టీసీ బస్సుల్లో నిత్యం నిలబడి ప్రయాణాలు చేసే కోడుమూరువాసులకు ఉచిత బస్సులతో మరిన్ని కష్టాలు మొదలయ్యాయి. ఇకనైనా ప్రభుత్వం స్పందించి రద్దీకి తగ్గట్లుగా ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచాలని, ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో మరిన్ని సర్వీసులను నడపాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.



అధ్వానంగా మారిన నూతనపల్లె రోడ్డు

### నెర్రలిచ్చిన రోడ్డు

కర్నూలు(రూరల్): కర్నూలు మండలం పసుపల గ్రామ పంచాయితీ పరిధిలోని నూతనపల్లె గ్రామానికి సూదిరెడ్డిపల్లె నుంచి వేసిన రెండు కిలోమీటర్ల సీసీ రోడ్డు పలుచోట్ల గుంతలు పడి నెర్రలివ్వడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రాత్రి సమయంలో నగరం నుంచి గ్రామానికి వచ్చేవారు నెర్రలిచ్చిన రోడ్డుపై అదుపుతప్పి ప్రమాదాల బారిప పడుతున్నారు. అధికారులు స్పందించి అధ్వానంగా మారిన రోడ్డును బాగుచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# శ్మశాన వాటిక నిండా కంప చెట్లే!




ఆర్.కొంతలపాడు శ్మశాన వాటికలో పెరిగిన కంప చెట్లు

కర్నూలు(రూరల్): మరణించిన వారికి అంత్యక్రియలు నిర్వహించేందుకు సౌకర్యాలు కరవవుతున్నాయి. పూడ్చి పెట్టేందుకు వెళ్తే అక్కడి పరిస్థితులు భయపెడుతున్నాయి. మండల పరిధిలోని ఆర్.కొంతలపాడు శశ్మాన వాటిక పరిస్థితి ఇదీ.. ఇక్కడ కంప చెట్లు ఏపుగా పెరిగాయి. మృతదేహాలను ఖననం చేసేందుకు వచ్చిన వారంతా శశ్మాన వాటిక నిండా పెరిగిన పిచ్చి మొక్కలను చూసి ఆవేదన చెందుతున్నారు. శశ్మాన వాటిక ఇలా ఉంటే అంత్యక్రియలు ఎలా నిర్వహించాలని ఆవేదన వ్యక్తం చేశారు. జయంతి, వర్ధంతి కార్యక్రమాలకు సమాధుల వద్దకు వచ్చి పూజ చేయాలంటే ఇబ్బందిగా ఉందని, అంతేగాక పిచ్చిమొక్కలు, ముళ్లపొదలతో నిండి ఉండటంతో విషపురుగులు సంచారిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి శ్మశాన వాటికలో ముళ్ల కంపలు, పిచ్చి మొక్కలను తొలగించాలని కోరుతున్నారు.

### కొనసాగుతున్న నీటి తరలింపు

పాణ్యం: గాలేరు నగరి సుజల స్రవంతి కాల్వలకు నీటి తరలింపు కొనసాగుతోంది. గోరుకల్లు జలాశయం నుంచి గాలేరు ద్వారా అవుకు, గండికోటకు నీటిని తరలిస్తున్నారు. ప్రస్తుతం 13 వేల క్యూసెక్కుల నీరు వెళ్తున్నట్లు అధికారులు ఆదివారం తెలిపారు. నీటి తరలింపులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నీటి ప్రవాహం కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. పైనుంచి వచ్చే నీటి ప్రవాహాన్ని యథావిధిగా దిగువకు పంపుతున్నట్లు తెలిపారు.

# రజకులు అన్ని రంగాల్లో రాణించాలి



నగదు, ప్రశంసా పత్రాలు అందుకున్న రజక విద్యార్థులు

కర్నూలు(అర్బన్): రజకులు అన్ని రంగాల్లో ఎదగాలని పలువురు నేతలు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో రజక విద్యా సేవా సమితి ఆధ్వర్యంలో ఏడవ రజక విద్యార్థుల ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సీపీ వెంకటేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎంపీ బస్తిపాటి నాగరాజు, మాజీ ఎమ్మెల్సీ దుప్పూరు రామారావు, రజక కార్పొరేషన్ చైర్మన్ సావిత్రి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీలో ఉత్తమ మార్కులు సాధించిన 92 మంది విద్యార్థినీ, విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.2 వేలతో పాటు మెడల్, ప్రశంసా పత్రాలను అందించి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యతోనే సమాజంలో గౌరవం దక్కుతుందన్నారు. రజకులకు కమ్యూనిటీ హాల్స్, దోబీఘాట్ల నిర్మాణాలకు ఎంపీ ల్యాడ్స్ నిధులు మంజూరు చేస్తామని బస్తిపాటి నాగరాజు చెప్పారు. కార్పొరేషన్ చైర్మన్ సావిత్రి మాట్లాడుతూ.. అనాదిగా సమాజంలో రజకుల పట్ల వివక్షత ఉందని, నేటికి అనేక గ్రామాల్లో రజకులు దస్తులు శుభ్రం చేయకపోతే గ్రామ బహిష్కరణ చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అక్కంతోట రామక్రిష్ణ, జొన్నగిరి ఎస్ఐ మల్లికార్జున, రజక కార్పొరేషన్ డైరెక్టర్లు పరమేష్, మధుసూధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులను సమర్పించుకోవాలని సూచించారు. అలాగే అన్ని మండల, డివిజనల్, మునిసిపల్ కార్యాలయాల్లోనూ పీజీఆర్ఎస్ నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు.

**అర్జీల పరిష్కార సమాచారం కోసం 1100 నంబర్**

పీజీఆర్ఎస్‌లో ఇచ్చిన అర్జీ పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవాలన్నా 1100 నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. అలాగే అర్జీదారులు meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో కూడా అర్జీలను నమోదు చేసుకునేందుకు అవకాశం ఇచ్చినట్లు తెలిపారు.

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పరిధిలోని ప్రజలకు తమ కాలనీల్లో ఏవైన సమస్యలు ఉంటే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

### పీజీఆర్ఎస్‌కు అధికారులందరూ హాజరవ్వాలి

సి.బెళగల్: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులందరూ తప్పనిసరిగా హాజరవ్వాలని తహసీల్దార్ వెంకటలక్ష్మి ఆదేశించారు. ఆమె ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడిస్తూ.. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం మండలంలోని అన్ని శాఖల అధికారులతో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందని, కార్యక్రమానికి మండల అధికారులందరూ తప్పక హాజరుకావాలని, హాజరుకాని అధికారులపై ఉన్నతాధికారులకు నివేదిక పంపడం జరుగుతుందన్నారు. మండల ప్రజలు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని, తమ సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ వెంకటలక్ష్మి పిలుపునిచ్చారు.

# ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి



సి.బెళగల్‌లో ప్రజలతో మాట్లాడుతున్న సీఐ తబ్రేజ్

సి.బెళగల్: ప్రజలు వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని కోడుమూరు సీఐ తబ్రేజ్ సూచించారు. ఆదివారం పోలీస్ స్టేషన్‌లో స్థానిక ఎస్ఐ పరమేష్‌నాయక్ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలతో సమావేశం నిర్వహించగా సీఐ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండేందుకు ప్రజలు, నాయకులు సహకరించాలని సీఐ కోరారు. గ్రామాల్లో జరిగే ఉత్సవాలు, వేడుకలు, పండుగలను ప్రజలంతా కలిసి జరుపుకోవాలన్నారు. వినాయక చవితి వేడుకల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా గట్టి బందోబస్త్ నిర్వహించనున్నట్లు సీఐ తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అలాగే ఉత్సవ నిర్వాహకులు మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని, మండపాల వద్ద నియమ నిబంధనలు, జాగ్రత్తలను పాటించాలని ఎస్ఐ సూచించారు.

# మార్కెటింగ్‌ను బట్టి పంటలు సాగు చేయాలి



మాట్లాడుతున్న ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రవికిశోర్

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయంలో రాణించాలంటే రైతులు మార్కెట్ సదుపాయాన్ని దృష్టిలో ఉంచుకొని పంటలు సాగు చేయాలని కర్నూలు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రవికిశోర్ సూచించారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సమావేశ మందిరంలో దేశీ డిప్లొమా కోర్సు కింద ఇన్‌పుట్ డీలర్లకు మార్కెట్ ఆధారిత పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులందరూ ఒకే పంట సాగు చేయడం వల్ల ఉత్పాదకత పెరుగుతుందని.. అలాంటి సమయంలో గిట్టుబాటు ధరలు లభించే అవకాశం ఉండదన్నారు. నాణ్యతతో కూడిన అధిక దిగుబడులు పొందాలంటే సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలన్నారు. ఫార్మర్ పోర్టల్‌లో ధరలను చూసుకొని పంట దిగుబడులను మార్కెటింగ్ చేసుకోవాలని సూచించారు. దేశీ కార్యక్రమ సమన్వయ కర్త, విశ్రాంత జేడీఏ జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

# కోలుకోలేక ఉపాధ్యాయురాలి మృతి

కర్నూలు సిటీ: నగర శివారులో గత నెల 31న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఉపాధ్యాయురాలు ఇందిర చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం మృతి చెందారు. ఈమె కర్నూలు రూరల్ మండల పరిధిలోని పసుపుల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా పనిచేస్తున్నారు. గత నెల 31న భర్తతో బైక్‌పై వెళుతుండగా జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కాలేజీ సమీపంలోని పెట్రోల్ బంక్ ఎదురుగా కుక్క అడ్డురావడంతో తప్పించే ప్రయత్నంలో భార్యభర్తలు కింద పడ్డారు. నగరంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం ఇందిర తుదిశ్వాస విడిచారు. సమాచారం తెలుసుకున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి.హృదయరాజుతో పాటు, ఆ సంఘం నాయకులు మరియానందం, తదితరులు ఇందిరా పార్థివ దేహనికి నివాళ్ళు అర్పించి, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు.

# టీడీఆర్ బాండ్లు పంపిణీ



స్థలాలు ఇచ్చిన వారికి టీడీఆర్ బాండ్లు అందిస్తున్న కమిషనర్ పి.విశ్వనాథ్

కర్నూలు (టౌన్): కర్నూలు నగర పరిధిలో నేషనల్ హైవే – 340 రహదారి విస్తరణలో స్థలం కోల్పోయిన బాధితులకు టీడీఆర్ (ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్) బాండ్ల ప్రక్రియ ప్రారంభించినట్లు నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ వెల్లడించారు. ఆదివారం స్థానిక నగరపాలకలోని తన చాంబర్‌లో స్థల యజమానులకు టీడీఆర్ బాండ్లు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. దామోదరం సంజీవయ్య సర్కిల్ నుంచి ఎస్.ఎస్.గార్డెన్స్ వరకు మొత్తం 2.34 కిలోమీటర్ల పొడవున 210 ఆస్తులు ప్రభావితమవుతాయన్నారు. ముందస్తుగా ముగ్గురికి బాండ్లు అందిస్తున్నామని, త్వరలో మరో 40 మందికి బాండ్లు అందజేస్తామన్నారు. విస్తరణ పరిధిలో 159 మందికి నోటీసులు జారీ చేశామని, ఇందులో 110 మంది సమ్మతి పత్రాలు అందజేశారన్నారు. సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.